# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 344 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 29, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా

**సిఎం సమక్షంలో కాంగ్రెస్ కండువా : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**న్యూఢిల్లీ,జూన్ 28(నమస్తే ఉదయం):** తనకు రాజకీయాలకన్నా నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అధికార పార్టీలో ఉంటే నిధులు తెచ్చుకుని అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచనతోనే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. అధికారంలో ఉంటే వెసులబాటు తెలియంది కాదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె

మిగతా.. 2లో


## ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఎయిర్‌పోర్ట్‌లో ఘనస్వాగతం



కొండా విశ్వేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న బిజెపి ఓబీసీ మోర్చా నాయకులు డి సత్యనారాయణ

**శంషాబాద్, జూన్28(నమస్తే ఉదయం):** చేవెళ్ల ఎంపీగా భారతీయ జనతా పార్టీ నుండి విజయం సాధించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నగరానికి మొదటిసారి వచ్చిన సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి నాయకులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.

బిజెపి బీసీ మోర్చా రాష్ట్ర నాయకులు డి సత్యనారాయణ, అత్తాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు షాబాద్ విజయకుమార్, ప్రధాన కార్యదర్శి సాయి యాదవ్, యువమోర్చ నాయకుడు కిరణ్ చారి లో విమానాశ్రయంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.



చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి సన్మానిస్తున్న అత్తాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు శాబాద విజయకుమార్

## ఇచ్చిన హామీమేరకు
# 2 లక్షల రుణమాఫీ..

- నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల
- రేషన్ కార్డు ఆధారంగా మాఫీ ఉండదు
- కేవలం పట్టాదారు పాస్ పుస్తకంతో సరిచూస్తాం
- బంగారం తాకట్టు రుణాలకు మాఫీ వర్తించదు
- రుణమాఫీ తరవాత రైతుబంధుపై దృష్టి పెడతాం
- అప్పులు తగ్గించుకునే పనిలో ఉన్నాం
- వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన
- ధరణి, మండలాలు, జిల్లాలపై అసెంబ్లీలో చర్చ
- ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది..ఆదాయం పెరిగింది
- కెసిఆర్ చేసిన తప్పులు తాము చేయబోం
- చేరికలు అంతటా జరుగుతూనే ఉన్నాయి
- కులగణన చేపట్టి తీరుతాం
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్ 28(నమస్తే ఉదయం):** తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి రేవంత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు-15 లోగా ఈ హామీని నెరవేరుస్తానని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాటిచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రక్రియ కూడా దాదాపు మొదలైంది. ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ప్రస్తావన వచ్చింది. దీనిపై మాట్లాడిన సీఎం.. రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని.. అది కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రూ. 2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని.. మరోసారి స్పష్టం చేశారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు మాఫీ కావని కూడా సీఎం చెప్పేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ క్రమంలో రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ తర్వాత రైతుబంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలుంటాయన్నారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు



చెప్పాం. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలతో బడ్జెట్ ఉండకూడదని అధికారులను ఆదేశాలు ఇచ్చాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తాం. కాళేశ్వరం సంబంధించిన వాస్తవాలను కూడా అసెంబ్లీ ముందుకు తెస్తాం. చర్చల తర్వాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళ్తాం అని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. ఆర్టీసీకి ప్రతి నెలా రూ.350 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 30శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. తద్వారా ఆర్టీసీకి నిర్వహణ నష్టాలు తగ్గాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లాభాలతో ఆర్టీసీ నడుస్తోంది. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్నా సరే.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తాం అన్నారు.

రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ప్రతి నెల రూ. 7వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ. 6,500 కోట్లు కట్టేవారు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారు. రుణభారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో ఉన్నాం. ఒక్కశాతం తగ్గినా రూ. 700 కోట్లు ఆదా అవుతాయి. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. బడ్జెట్ కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రులు.. కేంద్రమంత్రులను ఇప్పటికే ఒకసారి కలిశారు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి'లో ఉన్న లోపాలు సరి చేసే పనిలో ఉన్నాము. ఆ తరవాత ఏ పేరు పెట్టినా నడుస్తుంది. కంప్యూటరైజ్ చేయాలా..? లేక మాన్యూవల్ పద్ధతి పాటించాలా..? రెండే పద్ధతులు. ఏది చేయాలో అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. ఏ పాలసీ అయినా... ముందు అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాతే మార్పు చేర్పులతో తుది విధానం ప్రకటన చేస్తామని అన్నారు.. ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయం. కేసీఆర్ చేసిన తప్పులను మేం చెయ్యం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో విద్యుత్ కోత లేదు పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చే సరికి ప్రతి సంవత్సరం జరిగే నిర్వహణ పనులు జరగడం వల్ల అంతరాయం ఏర్పడింది. బడ్జెట్ వ్యవహారంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలకు ఉచిత రవాణా సదుపాయం వల్ల టెంపుల్ టూరిజం పెరిగింది. అక్కడ జీఎస్టీ కూడా పెరిగింది' అని రేవంత్ చెప్పుకొచ్చారు. 'రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతు రుణమాఫీ తరువాత రైతు బంధు ఇతర పథకాలపై దృష్టి పెడతాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంలో కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదు. అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలి. మోదీ 10 ఏళ్లలో 16 లక్షల కోట్లు కార్పొరేట్లకు

మిగతా.. 2లో



# దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు..

- మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందాం
- తెలంగాణ ఆర్తి మనకే బాగా తెలుసు
- తెలంగాణ ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేది మనమే
- పార్టీని నేతలెవరూ ప్రభావితం చేయలేరు
- నిజామాబాద్, కరీంనగర్ నేతలతో కెసిఆర్

**గజ్వేల్,జూన్ 28(నమస్తే ఉదయం):** పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? అని వ్యాఖ్యానించారు. ఎక్కడైతే పార్టీని వీడారో అక్కడ మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను బయలుదేరినప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేలు లేరని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉందని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ధైర్య వచనాలు చెప్పారు. కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. కొన్ని కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారని, మొన్నటి ఎన్నికల్లో అదే జరిగిందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహ పడొద్దతీ, అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతి కాదని పార్టీ కేడర్‌కు హితబోధ చేశారు. ఏ హోదాలో వున్న కానీ ప్రజల కోసం పని చేయాల్సిందేనని, అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి మాత్రమేనని అన్నారు. ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను బీఆర్ఎస్ మాత్రమే నెరవేరుస్తుందన్నారు. ఆనాడు ఉద్యమంలకు దిగినప్పుడు మనతో ఎవరున్నారు?. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటదని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

మిగతా.. 2లో



## మొహర్రం నిర్వహణకు ఏర్పాట్లు

- అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం
- భారీబందోబస్తు ఏర్పాటుకు ఆదేశం

**హైదరాబాద్,జూన్ 28(నమస్తే ఉదయం):** మొహర్రం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రధాన ఏనుగు ఊరేగింపు రోజున ఊరేగింపు జరిగే మార్గాలలో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు త్రాగు నీరు అందించాలని, జి.హెచ్.యంసి అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ-కా-ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సంతాపం తెలిపేందుకు ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వారి కోసం మినీ బస్సులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి,

మిగతా.. 2లో

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

**హైదరాబాద్,జూన్ 28(నమస్తే ఉదయం):** తెలంగాణ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదలయ్యాయి. సప్లిమెంటరీ ఫలితాల్లో 73.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలకు 51,272 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 46,731 మంది హాజరయ్యారు. వీరిలో 34,126 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 71.01 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, బాలికలు 76.37 శాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటారు. బాలుర కంటే బాలికలు 5.36 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు చేశారు. నిర్మల్ జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా 42.14 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి చివరి స్థానంలో నిలిచింది. ఫలితాల కోసం ఈ వెబ్‌సైట్‌ను క్లిక్ చేయొచ్చు. రీకౌంటింగ్ చేయించాలనుకునే విద్యార్థులు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం జులై 8వ తేదీ లోపు ఎస్బీఐ బ్యాంక్ ద్వారా చలాన్ చెల్లించాలి. ఆ చలాన్‌తో పాటు దరఖాస్తును ఎస్సెస్సీ బోర్డులో సమర్పించాలి. డిమాండ్ డ్రాఫ్ట్‌లు అంగీకరించ బడవని అధికారులు స్పష్టం చేశారు.



## రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా రోడ్ల నిర్మాణం

- త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం
- కేంద్ర బృందం వచ్చేలోగా నివేదికలు సిద్ధం
- అధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

**హైదరాబాద్,జూన్ 28(నమస్తే ఉదయం):** మనం నిర్మించే ప్రతి రోడ్డు ప్రజలకు ఉపయోగపడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. జూలై మొదటి వారంలో ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల బృందం రానున్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరై పనులు నడుస్తున్నవి, పలు అనుమతుల కోసం పనులు ఆగిపోయినవి, అప్‌గ్రేడ్ కోసం విన్నవించిన జాతీయ రహదారులకు సంబంధించిన సమస్త సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.



రోడ్డు ప్రమాదాల కారణంగా రోజూ పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోతుంటే నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. ఎన్ని కోట్లు పెట్టిన పోయిన ప్రాణం తిరిగి రాదని.. ప్రభుత్వం నిర్మించాల్సిన రోడ్డు మూలంగా ప్రజల ప్రాణాలు పోతే.. ఇక ప్రభుత్వం ఉండి ఎందుకని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని న్యాక్ ఆఫీసులో జాతీయ రహదారులపై ఎన్‌హెచ్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రానికి మణిహారంగా మారనున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్ )పై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. ముఖ్యంగా ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో మరింత చురుగ్గా పనులు చేయాలని మంత్రి సూచించారు. ఒక్క ఆర్‌ఆర్‌ఆర్ పనులు ప్రారంభమైతే రాష్ట్రానికి ఎంటర్‌టైన్ మెంట్ జోన్లు, డిస్నీల్యాండ్ వంటి ప్రఖ్యాత సంస్థలు, ట్రాన్స్‌పోర్టు హబ్‌లు, పారిశ్రామిక కారిడార్లు ఏర్పడి రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. మన్నెగూడ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం 930 చెట్లను రిలోకేట్ చేయాల్సి ఉండటంతో పాటు పలు అనుమతుల వల్ల ఆలస్యమవు తుందని ఈ సందర్భంగా మంత్రికి అధికారులు వివరిం చారు. అప్పుడు చెట్లు లేకుండా రోడ్ల నిర్మాణానికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు ఎందుకు నిర్మించడం లేదని మరోసారి ప్రశ్నించారు. ఆలస్యానికి సాకులు వెతక్కుండా, జరగాల్సిన పనులు జరపాలని అన్నారు. ఇబ్బందులు ఉన్నచోట్ల సమస్యల్ని పరిష్కరించేందుకు మార్గం వెతకాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రీలొకేట్ చేయాల్సిన 330 చెట్లను కాంట్రాక్టు సంస్థతో రేపు మాట్లాడి చేయిస్తానని చెప్పారు. మిగితా వాటి సంగతిని వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్-విజయవాడ

మిగతా.. 2లో

# పొదుపు ద్వారా మహిళా భ్యున్నతికి కృషి

**రాజేంద్రనగర్, జూన్28(నమస్తే ఉదయం):** పేద ప్రజల జీవన విధానాలను మెరుగుపరిచి, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా టౌన్ లెవెల్ ఫెడరేషన్ లో భాగస్వాములుగా ఉన్న మహిళా ప్రతినిధులు కృషి చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో టౌన్ లెవెల్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహిళా సంఘాలు చేస్తున్న పొదుపు, వారికి బ్యాంకుల ద్వారా అద్దుతున్న రుణాలు, నూతన మహిళా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు , పారిశుద్ధ్య నిర్వహణలో మహిళా సంఘాల పాత్ర పై చర్చించారు.

అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ విభాగం డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధారాణి మాట్లా డుతూ, రాజేంద్రనగర్ సర్కిల్లో 1,564 మహిళా స్వయం సహా యక పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. ఒక్కో సంఘంలో పదిమంది చొప్పున మహిళలు సభ్యులుగా ఉండి పొదుపు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రూ. 25 కోట్లను మహిళా సంఘాలకు రుణాలుగా ఇప్పించడం జరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో నాలుగు వేల స్కూల్ డ్రెస్‌లను మహిళా సంఘాల సభ్యులు కుట్టడం జరిగిందన్నారు. దానిద్వార మహిళలకు అదనపు ఆదాయం సమకూరిందని గుర్తుచేశారు.

**పాలిశుద్ధ్య నిర్వహణలో ప్రత్యేక భాగస్వామ్యం :**

రాజేంద్రనగర్ సర్కిల్‌లోని బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరు స్వచ్ఛ ఆటో లకు చెత్త ఇచ్చే విధంగా అవగాహన కల్పించడంలో మహిళా సంఘాల పనితీరు ఎంతో గొప్పగా ఉందని రాధారాణి తెలిపారు. కాలనీలలో, బస్తీలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్తను బయట వేయవద్దని సూచిస్తూ ముందుకు సాగు తున్నారన్నారు. ప్రజలు కూడా ఆలోచించి చెత్తను తమ ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. రూ.1000 ఇవ్వాల్సి వస్తుందని బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయడం ద్వారా పర్యావరణానికి హాని కలిగిస్తున్న వారుగా, ప్రజలు అనారోగ్యాల బారిన పడడానికి కారకుల మవుతామనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు.



టీఎల్ఎఫ్ ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్‌లతో రాధారాణి







# ధరూర్, కేటిదొడ్డి, గట్టు పోలీస్ స్టేషన్‌లను సందర్శించిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు

**గద్వాల(కేటిదొడ్డి) జూన్28(నమస్తే ఉదయం):** గద్వాల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శు క్రవారం ధరూర్, కేటి దొడ్డి, గట్టు పోలీస్ స్టేషన్ లను సందర్శించి స్టేషన్ ల పరిసరాలను, సిబ్బంది నిర్వహించే విధులను పరిశీలించారు. అందులో భాగంగానే స్టేషన్‌ల పరిసరాలను పరిశీలించి 5Sలో బాగంగా ఎవరి పరిదిలోని వారు వారికి కేటాయించిన ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సిబ్బంది తో మాట్లాడుతూ ...ఆయా పోలీస్ స్టేషన్ లకు రోజుకు ఎన్ని పిర్యాదులు వస్తున్నాయి, ఎన్నీ కేసులు నమోదు అవుతున్నాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారునితో గౌరవం తో మెలుగుతూ సింపతి తో మాట్లాడాలని అన్నారు. ఏ స్థాయిలో ఉన్న వారు అయిన అందరిని సమానంగా చూడాలని



ఆదేశించారు.

బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వాస్తే న్యాయం జరుగుతుందని నమ్మకం ప్రజలకు కల్గించాలని ఆ దిశగా సిబ్బంది,అధికారులు బాధ్యతా తో విధులు నిర్వహించాలని అన్నారు. సిబ్బంది అధికారులు గ్రామాలను సందర్శించి గ్రామాలలో ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, గ్రామస్థులతో సత్సంబంధాలను మెరుగుపరుచు కోవడం ద్వారా నేరాలకు సంబంధించి సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలని అన్నారు. జులై నుండి అమల్లోకి వచ్చే కొత్త క్రిమినల్ చట్టాల పై ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన పెంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఈ సందర్శనలో ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు విజయ కుమార్, శ్రీనివాస రావు, మల్లేష్, ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు రాజేంద్రనగర్ తాలూక ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ నయీమ్ ఉద్యోగ విరమణ

**వాలంతరీలో మధ్యాహ్నం ఒంటిగంటకు సన్మాన సభ**

**హాజరు కానున్న ప్రొఫెసర్ కోదండరాం, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్ , డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ లు**

**రాజేంద్రనగర్, జూన్28(నమస్తే ఉదయం):** హిమాయత్ సాగర్ లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వాలంతరీ) లో వర్క్ ఇన్స్పెక్టర్ గ్రేడ్ 2 గా ఉద్యోగం చేస్తూ, టీఎన్జీవోస్ రాజేంద్రనగర్ తాలూకా జేఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మహ మ్మద్ అబ్దుల్ నయీమ్ శనివారం ఉద్యోగ విరమణ పొందుతున్నారు. 41 సంవత్సరాల పాటు ఎంఎ నయీమ్ వాలంతరీలో ఉద్యోగం చేశారు.



ఎం.ఎ.నయీమ్

**రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా:**

ఎంఎ నయీమ్ రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో ఆయన నాయకత్వంలో రాజేంద్ర నగర్ తాలూకా పరిధిలో తెలంగాణ సాధన కోసం అనేక ఉద్యమాలు జరి గాయి. సకల జనుల సమ్మెలో ఆయన చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆయన కాలికి తగిలిన గాయం ఇంకా తగ్గలేదు. ఉద్యోగంలో రెండుసార్లు ప్రమోషన్ వచ్చిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్య మంలో పాల్గొంటుండడం కారణంగా, పిల్లల బాగోగులు చూసుకోవడం కోసమని ప్రమోషన్లు తీసుకోలేదు.

**నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడిగా .....**

రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షునిగా కూడా ఎం ఎ నయీమ్ సేవలందించారు. ఆయన హయంలో యూత్ క్లబ్‌లో అదనపు భవన నిర్మాణం, క్రీడా పోటీల నిర్వహణ కార్యక్రమాలు చేపట్టారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం

# పక్క ప్రణాళికతో ముందుకు సాగుతోంది..

**అంజయ్య నగర్ స్మశానవాటికను పరిశీలించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్**

**కూకట్‌పల్లి, జూన్ 28 (నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్క ప్రణాళికతో గ్రేటర్ హైదరా బాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చూపుతామని,డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల అహర్నిశలు కృషి చేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర గౌడ్ అన్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ బస్తీ స్మశానవాటికలో నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయన బస్తి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ గౌస్, నందు, విక్రమ్, యాదయ్య గౌడ్, వినోద్ యాదవ్, చంద్ర కాంత్, మురళి, నర్సింహ, ఆంజనేయులు సాగర్, చెన్నయ్య,



సుమన్, శివ, రాము, సురేష్, బాలరాజు, శివరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

# పివికి నివాళి అర్పించిన సిఎం రేవంత్

**మంత్రులు భట్టి, ఉత్తమ్‌లు కూడా శ్రద్ధాంజలి**

**న్యూఢిల్లీ,జూన్28(నమస్తే ఉదయం):** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి.చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలావుంటే పీవీ స్పూర్తితో దేశాభివృద్ధి కోసం పనిచేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పీవీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు తెలం గాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, గడ్డం వంశీకృష్ణ, జైవీర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ వంశీ కృష్ణ.. దేశ అభ్యున్నతికి పీవీ సంస్కరణలు ఎంతగానో ఉపయోగ పడ్డాయని చెప్పారు. పీవీ నరసింహారావు కేబినెట్‌లో కాకా కేంద్రమంత్రిగా దేశాభివృద్ధిలో భాగం అయ్యారని తెలిపారు. ఆ



రోజుల్లో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చేవారని.. ఇపుడు స్పీకర్ ఓం బిర్లా నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా స్పీకర్ చర్యలున్నా యన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పార్ల మెంట్‌లో కొట్లాడుతామన్నారు ఎంపీ వంశీకృష్ణ. నీట్ పేపర్ లికేజ్‌పై చర్చ చేపట్టాలంటూ విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్ చేస్తూ లోక్ సభ వెల్5లో ఆందోళనలు చేశామ న్నారు. దేశం అత్యంత క్లిష్ట సమయంలో ఉన్న దశలో దేశానికి ఒక దిశను చూపించిన వ్యక్తి పీవీ నరసింహారావు అని ఎంపీ మల్లు రవి అన్నారు.

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా

(మొదటి పేజీ తరువాయి)

యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.

అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయాక, పార్లమెంట్ ఎన్నికల్లో పరువు నిలబెట్టుకుందామనుకున్న బీఆర్ఎస్‌కు అడుగడుగునా ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలను నిలబెట్టుకోలేకపోవడం.. లోక్‌సభ ఎన్నికల ముందు సిట్టింగ్ ఎంపీలే జంప్ అవ్వడం, టికెట్ దక్కించుకున్న తర్వాత ఊహించని రీతిలో ఝలక్ ఇచ్చేసి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేయడం గమనార్హం. ఈ షాక్‌ల నుంచి తేరుకోకముందే వరుసగా నలుగురు ఎమ్మెల్యేలు ఈ మధ్య కాలంలోనే బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పేయడంతో కారు పార్టీ కంగుతిన్నది. ఇలా ఒక్కొక్కరుగా 'కారు' దిగుతుండగా.. తాజాగా చేవెళ్ల నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, టి. కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీల సమక్షంలో ఈ చేరిక జరిగింది. కాంగ్రెస్ కండువా కప్పిన రేవంత్.. యాదయ్యను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు.. త్వరలో మరికొన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాలె యాదయ్య.. కాంగ్రెస్ పార్టీతోనే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జడ్పీటీసీగా పనిచేసిన ఆయన.. తొలిసారి 2009 ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్ స్థానమైన చేవెళ్ల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. టీడీపీ తరఫున పోటీచేసిన కోరాని సాయన్న రత్నం గెలిచి.. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో పార్టీ మారిన ఇదే ప్రత్యర్థిపైనే.. యాదయ్య పోటీచేసి 781 ఓట్ల మెజార్టీతో తొలిసారి గెలుపొందారు. టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో కొద్దిరోజుల్లోనే గులాబీ కండువా కప్పేసుకున్నారు. ఇక 2018 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున పోటీచేసి 33,552 మెజార్టీతో గెలిచారు. 2023 ఎన్నికల్లో మాత్రం ప్రత్యర్థి పామేని భీమ్ భరత్ కాంగ్రెస్ నుంచి పోటీచేయగా.. సాయన్న బీజేపీ నుంచి పోటీచేశారు. అయినా సరే ఈ ఇద్దర్నీ ఓడించి అతి తక్కువ 268 ఓట్ల మెజార్టీతో గ్గటెక్కారు. దీంతో వరుసగా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే అయ్యారు యాదయ్య. ఈయన రాకతో కాంగ్రెస్ శ్రేణులు, నేతలు హ్యాపీగా ఫీలవుతున్నారు.

# మొహర్రం నిర్వహణకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

మిర్జా రహమత్ బేగ్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మెరాజ్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫెకర్ అలీ, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ , వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, వైస్ చైర్మన్ ,ప్రెసిడెంట్ ÷ఓఖీఇఎ÷ూ ఫహీమ్ ఖురేషి, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉఊఓఅ కమిషనర్ అమ్రపాలి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు..

(మొదటి పేజీ తరువాయి)

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కే. సంజయ్ కుమార్ ఒక పక్క డాక్టర్‌గా మరోపక్క ఎమ్మెల్యేగా ప్రజాసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కేసీఆర్ అభినందించారు. గత 15 రోజులుగా కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం కూడా కొనసాగాయి. కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు మూడు రోజులు బ్రేక్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. కేసీఆర్‌తో పార్టీ ముఖ్యనేతలు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆత్మీయ సమావేశాల పునఃప్రారంభ వివరాలను, ఏ నియోజకవర్గాల వారు ఎప్పుడు రావాలనే విషయాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఇప్పటికే పలు దఫాలుగా పార్టీ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమవుతున్నారు. ఈ క్రమంలోనే గత రెండు వారాలుగా నియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నేతలను భేటీ అవుతున్నారు. తనను చూసేందుకు ఎర్రవెల్లి నివాసానికి వస్తున్న ప్రజలతో ఓపికగా కలుస్తున్నారు. గంటల పాటు నిలబడి వారిని కేసీఆర్ ఆప్యాయంగా పలకరిస్తూ.. వారితో ఫొటోలు దిగుతున్నారు. గత 15 రోజుల్లో దాదాపు 50 వేలకు పైగా ప్రజలు తమ అభిమాన నేతను కలిసి తమ ఆనందాన్ని, కష్టసుఖాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

# రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ రహదారికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఫోర్ క్లోజ్ చేసి, వచ్చే నెలలో కొత్త టెండర్లు పిలిచి, సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించామని మంత్రి తెలిపారు. ఇందులో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా ప్రతి నిత్యం పర్యవేక్షించాలని జాతీయ రహదారుల సంస్థ ఆర్వో రజాక్‌ను ఆదేశించారు. ఆర్మూర్-మంచిర్యాల జాతీయ రహదారి కోసం 630 హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా.. ఇప్పటికే 530 హెక్టార్లు సేకరించామని ఈ సందర్భంగా మంత్రికి అధికారులు తెలిపారు. మిగతా పనులను ఈ నెలలో పూర్తి చేస్తామని వివరించారు. వీటితో పాటు ఉప్పల్-ఘట్ కేసర్ ఫ్లైఓవర్ పనులపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాల మేరకు ఫోర్‌క్లోజ్ చేసి కొత్త టెండర్లు పిలుస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా సంస్థలను ఖరారు చేయాలన్నారు. ఫ్లైఓవర్ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎల్బీనగర్-మల్కాపూర్ రోడ్డులో మన్నెగూడ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద నిర్మించాల్సిన బ్రిడ్జ్ సమస్యల గురించి మంత్రికి అధికారులు వివరించగా పరిష్కారానికి హామీ ఇచ్చారు.

# ఇచ్చిన హామీమేరకు 2 లక్షల రుణమాఫీ..

(మొదటి పేజీ తరువాయి)

మాఫీ చేస్తే ఎవరు ప్రశ్నించరు..? కానీ మహిళలు, రైతులు, పేదలకు ఇస్తే మాత్రం తప్పుపడుతున్నారు' అని ఉదహరించి మరీ రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా.. మహిళలకు పీసీసీ ఇస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు మహిళలకు పీసీసీ ఇస్తే బానే ఉంటుందని సీఎం సమాధానం ఇచ్చారు. విలేకరుల సూచనలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పీసీసీ రేసులో ఎవరైనా ఉండొచ్చని.. సామాజిక న్యాయంలో భాగంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు, ఈబీసీలు కూడా ఉండొచ్చన్నారు. ఫిరాయింపుల తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదని.. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ఫిరాయించారన్న విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులు, తాము చేయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తకొత్త పీసీసీ చీఫ్ నియామకం, సామాజిక సమీకరణాలు దృష్టిలో ఉంచుకుని హై కమాండ్ డిసైడ్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ బీ ఫామ్ మిద గెలిచిన వారికి మాత్రమే పదవులు వచ్చాయి. పీసీసీ చీఫ్‌గా రెండు ఎన్నికలు పూర్తి చేశా. జూలై 7 తో మూడేళ్ల పీసీసీ పూర్తి కానుంది. పీసీసీ , కేబినెట్ విస్తరణ నిర్ణయాలు ఒకే సారి ఫైనల్ అవుతాయని అన్నారు.




ఈ సెట్‌లోప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

## ఈ సెట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి

**కొత్తకోట,జూన్28(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త వహీద్ కుమారుడు ఈసెట్ లో స్టేట్ 21 ర్యాంక్ సాధించారు. ఈ సెట్ లో 21 ర్యాంకు సాధించిన విద్యార్థికి పాలమూరు యూనివర్సిటీలో బీ ఫార్మ్ సీ సీటు లభించింది. ప్రతిభ చాటిన విద్యార్థిని దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఘనంగా పీవీ జన్మదిన వేడుకలు

**న్యూఢిల్లీ, జూన్28(నమస్తే ఉదయం):** భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు జయంతి వేడుకలు దేశ రాజధాని న్యూఢిల్లీలో ఘనంగా జరిగాయి. శుక్రవారం బిజెపి



భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావుకు పుష్పాంజలి ఘటిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి మాజీ ప్రధాని పివి నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

## నీటి సమస్య ఉంటే ఫోన్ చేయండి

### నేడు 'డయల్ యువర్ జలమండలి ఎండీ' కార్యక్రమం

**హైదరాబాద్, జూన్ 28(నమస్తే ఉదయం):** జలమండలిలో రేపు 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం జరగనుంది. ఎండీ అశోక్ రెడ్డి వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని స్వయంగా స్వీకరించనున్నారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ ప్రోగ్రామ్ జరుగుతుంది.



వివిధ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న మంచినీటి సరఫరా, సీవరేజీ, మీటర్, బిల్లింగ్, నల్లా కనెక్షన్, రెవెన్యూ, ఇతర అంశాలకు సంబంధించిన సమస్యల్ని వినియోగదారులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 040- 23442881 లేదా 23442882 లేదా 23442883 నంబర్లకు కాల్ చేసి తమ క్యాన్ నంబరు గానీ, ఇంటి నెంబరు గానీ, మొబైల్ నంబరు గానీ చెప్పాల్సి ఉంటుంది. డయల్ యువర్ ఎండీ కార్య క్రమం జరిగే సమయంలో బోర్డు డైరెక్టర్లు సహా.. అన్ని సర్కిల్, డివిజన్ ఉన్నతాధికారులు ఉంటారు. వినియోగదారులు చెప్పే సమస్యల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తారు.

## దివంగత ప్రధాని పివినీ ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి..

### ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన వ్యక్తి పీవి నర్సింహారావ్...

### కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి

**కూకట్‌పల్లి, జూన్ 28 (నమస్తే ఉదయం):** దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు అమోఘమైన తెలివితేటలకు నిదర్శనమని కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కె పి హెచ్ బి కాలనీలో శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఉద్ధరించి, దేశం ఈ నాడు ఇంత గొప్ప ఆర్థికశక్తిగా వెలుగొందడానికి పునాదులు వేసిన అపర చాణుక్యుడు అని కొనియాడారు. ఇహలోక బంధాలన్నీ వదిలేసి, కుర్తాలం



పీఠాధిపతిగా వెళ్దామని సిద్ధపడుతున్న తరుణంలో దేశమాత పిలుపు వచ్చిందన్నారు. ఎంత మందో అధికార పీఠం కోసం అర్రులు చాస్తున్న వేళ, తనొచ్చి ప్రధాన పదవి పీఠాన్ని అధిష్ఠించారని అన్నారు. ఒక మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్ళ పాటు విజయవంతంగా నడపడంలో అనేక సవాళ్ళు, ఆటుపోట్లు, అపనిందలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. పదవిలో ఉండగానే, కోర్టు ఖర్చు కోసం, ఇల్లు కూడా అమ్ముకున్న స్థిత ప్రజ్ఞుడని కొనియాడారు. హంగూ, ఆర్భాటం, ఆడంబరం, అతిశయం, ప్రచార యావ లేని నిరాడంబర, రాజనీతిజ్ఞుడని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు లాంటి గొప్ప నాయకుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు రజితమ్మ, జోజమ్మ, బి సంజీవరావు, మేకల మైకల్, బి బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, మాజీ వార్డు సభ్యురాలు మనీ అమ్మ ,వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి ఫణీంద్ర కుమార్ ,బాబ్జి కుమార్, నాగమల్లేశ్వరరావు లుంగీ రాజు ,రాజు ముదిరాజు, శేషగిరిరావు, సూరిబాబు, కొమ్ము బాబు, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):** జిల్లాలో సంక్షేమ వసతి గృహ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. శుక్రవారం సంక్షేమ వసతి గృహ విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని గద్వాల జిల్లా కార్యాలయంలో అధికారి శ్వేతా ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు.
జిల్లాలోని 29 ఎస్ సి, ఎస్ టీ, బిసి సంక్షేమ వసతి గృహాల్లో దాదాపుగా 3,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వీరి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 9 హాస్టల్ వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని దీనివల్ల వార్డెన్ లకు అదనపు బాధ్యతలు అప్పగించారని, పూర్తిస్థాయిలో వార్డన్ లు లేకపోవడం వల్ల వసతి గృహ నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని అన్నారు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్లు లేకపోవడం వల్ల వసతి గృహాలు మురికి కుపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉండవెల్లి,రాజోలి, గద్వాలలోని బీసీ బాలుర బీసీ బాలికల కళాశాల వసతి గృహాలకు నుతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గట్టు, అల్లంపూర్‌లో వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి వార్డెన్ల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో వసతి గృహాల మూసివేతకు చర్యలు తీసుకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధరూర్‌లో బాత్రూమ్స్ ఉన్న నీరు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రారంభించలేదని దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నారని అన్నారు.
మల్దకల్ వసతి గృహానికి సొంత ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. గద్వాలలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహంలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందని దీనివల్ల విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం



చేశారు. ఎస్సీ బాలికల బాలుర కళాశాల వసతి గృహాలు కళాశాలకు చాలా దూరంగా ఉన్నయని అందువల్ల విద్యార్థులు అడ్మిషన్లు కూడా తగ్గుతున్నాయని వారికోసం ప్రత్యేక బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యార్థుల లాగే కళాశాల విద్యార్థులకు సైతం నోట్ పుస్తకాలు కాస్మెటిక్ చార్జీలు తదితర సౌకర్యాలు అందజేయాలని డిమాండ్ చేశారు. బిసి వసతి గృహాలకు సంబంధించి ఆన్లైన్లో కాకుండా ఆఫ్ లైన్ లోనే దరఖాస్తులు తీసుకొని దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పరుశురాం, అనిల్ కుమార్, వినోద్ కుమార్, విద్యార్థులు మహేష్, రాజేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# డీఈఓను విధుల నుండి తొలగించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):** ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నా చర్యలు తీసుకోలేని జిల్లా విద్యాశాఖ అధికారిని వెంటనే విధుల నుండి తొలగించాలని ఏబివిపి నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏబివిపి ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సురేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ జరగక విద్యార్థులు విద్యకు దూరం కావాల్సి వస్తుంది అని తెలిపారు. ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలో లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తూ పుస్తకాలు,యూనిఫామ్ ,బెల్ట్ టై వంటి అమ్ముకుంటూ విచ్చలవిడిగా రాజ్యం ఏలుతున్నారని పలుమార్లు పుస్తకాలు అమ్ముతున్నారని ఆధారాలతో ప్రత్యక్షంగా అధికారులకు పట్టించిన నామమాత్రపు చర్యలు తీసుకుని ప్రవేట్ యాజమాన్యాలు ఇచ్చే సొమ్ముకు అమ్ముడుపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి ఇప్పటివరకు విద్యా శాఖ మంత్రి నియమించకపోవడం సిఎం రేవంత్ రెడ్డికి విద్యారంగంపైన ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందన్నారు. ఇకనైనా జిల్లా విద్యాధికారి మొద్దు నిద్ర వీడి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.




అలాగే అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకొని నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలకు గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మెగా డిఎస్సి ద్వారా అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సత్వరమే భర్తీ చేయాలని అలాగే ప్రైవేట్ పాఠశాలలో 25% పేద మధ్య తరగతి విద్యార్థులకు కేటాయించాలి.
ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర విడాలని లేనిపక్షంలో సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.
అనంతరం డీఈఓ ఇందిరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జగదీశ్, వెంకటేష్, వీరశేఖర్, నరేష్, గణేష్, అశోక్, నరేష్, మురళి, పవన్, చందు, శ్రీను, లోకేష్, మహేష్, శివప్రసాద్, శాంతిరాజ్, రాకేష్, మహేష్, నవీన్, అనిల్,తదితరులు పాల్గొన్నారు..

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల దోపిడీని అరికట్టాలి

### - ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):** విచ్చలవిడిగా ప్రవేట్ పాఠశాలలు ఫీజులు, పుస్తకాల దందాలు చేస్తున్న ,జిల్లా విధ్యాశాఖ అధికారులు కీలుబొమ్మగా మారారాని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ ఆరోపించారు . జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఆఫీస్ ముందు నిరసన తెలిపి వినతి పత్రం సమర్పించారు.
జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న ప్రవేట్ పాఠశాలలు అడ్డు అదుపు లేకుండా విద్యార్థుల దగ్గర నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, పుస్తకాల దందాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ...ఇంత జరుగుతున్న పట్టించుకోకుండా ప్రవేట్ పాఠశాలలతో విద్యాశాఖ అధికారులు కలిసి కుమ్మక్కై విద్యార్థులకు తీరునీ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.అధిక ఫీజుల వలన విద్యార్థులను వారి తల్లిదండ్రులు చదివించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీంతో విద్యార్థులు సరైన విధంగా విద్యలో రాణించలేకపోతున్నారు.
కావున ఇటువంటి ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు ప్రవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు తగ్గించాలని విద్యార్థి సంఘం నాయకులు డి ఈ ఓ ఆఫీస్ ముందర నిరసన వ్యక్తం



చేసి డిఇఓ (డీఈవో)కి వినతి పత్రం ఇచ్చారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి హనుమేష్, కాశీం,వెంకటేష్, నరేష్, ఉరుకుందు, నరేంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ అధికారి ఉద్యోగం సాధించిన మాజీ ఎంపీటీసీ రామ్ గౌడ్ కూతురు గాయత్రి

### - గాయత్రిని సన్మానించిన నాయకులు

**కొత్తకోట, జూన్28(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ రామ్ గౌడ్ కుమార్తె గాయత్రి వ్యవసాయ శాఖ అధికారిగా ఉద్యోగం సాధిం చింది. అగ్రికల్చర్ ఆఫీసర్గా ఉద్యోగం సాధించిన గాయత్రిని కొత్తకోట కాంగ్రెస్ నాయకులు ఆమె ఇంటికి వెళ్లి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్తకోట మాజీ సర్పంచ్, వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ సాక బాల నారాయణ మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో గాయత్రి ఉద్యోగం సాధించటం అభినందనీయమన్నారు.



వ్యవసాయ అధికారి ఉద్యోగం సాధించిన గాయత్రిని సన్మానిస్తున్న మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాల నారాయణ

గాయత్రిని సన్మానించిన వారిలో 10వ వార్డు ఇంచార్జి వలుగుమాను శ్యామ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసురెడ్డి, మాజీ సర్పంచి కొత్తకోట టౌన్ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాసులు, కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, కొత్తకోట టౌన్ మైనారిటీ అధ్యక్షులు ఇజాజు అలీ సలీంఖాన్, బిసి సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, అంజన్న యాదవ్, నజీమ్, సాయిలు, సందనారాయణ, ఎన్ఎస్‌యుఐ సభ్యులు ఆంజనేయులు, సురేష్, సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం...

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):**
గద్వాలలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నూతన ఎన్ సీసీ యూనిట్ ను ఎన్ సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ కే సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లాడుతూ ఎన్ సీ సీ లో చేరడం వలన విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించవచ్చని, భవిష్యత్తులో విద్య ఉపాధిలో రిజర్వేషన్లు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట నరసయ్య, పాఠశాల ఎన్ సిసి ఇంచార్జ్ రాముడు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## దాతల సహాయంతో స్మశాన వాటికలో మౌలిక పదుపాయాలు..

### - మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్

### సత్యహరిశ్చంద్ర స్మశానవాటిక అభివృద్ధికి రూ.లక్ష విరాళం..

**రాజేంద్రనగర్,జూన్ 28 (నమస్తే ఉదయం):**
అరాంఘర్ లోని సత్య హరిచంద్ర స్మశాన వాటికలో కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మాజీ కౌన్సిలర్,సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఎస్.వెంకటేష్ కురుమ,బంధువులు మల్లయ్య అక్కమ్మ పేరుపై వారి కుమారులు తమ వంతుగా రూ.లక్షను అందించారు.ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ కురుమ మాట్లాడుతూ.. స్మశానవాటికలో వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.చివరి మజిలీలో ప్రశాంతంగా ఉండటానికి శ్మశాన వాటికలను




నూర్ మహ్మద్ కుంట వద్ద గల స్మశాన వాటికలో సిమెంట్ బెడ్ పనులు చేయిస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేష్

అభివృద్ధి చేయాలన్నారు.ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ఆలోచన చేస్తే స్మశాన వాటికలు మార్పు వస్తుందన్నారు.సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో దాతలు బెల్లంపల్లి వెంకటేష్,బెల్లంపల్లి కుమార్,బెల్లంపల్లి చందు, బెల్లంపల్లి యాదగిరి,బెల్లంపల్లి మల్లయ్య,మనవడు ఉప్పల్ శ్రీనివాస్,పోతురాజు మల్లేష్,రాజ్ కుమార్, నరసింహ,మిల్లర్, రఘువీర్,దాసరి,రమేష్,చిట్టి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ వెంకటేష్ ధాతలను అభినందించారు.

## వర్షపు నీటితో జూరాలకు జలకళ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):**
ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వర్షపు నీటితో జళకళ సంతరించుకుంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్ నెలలో కురిసిన వర్షాలకు కృష్ణానదిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల నుండి వచ్చిన నీటి చేరికతో ప్రాజెక్టుకు జలకళ వచ్చింది.
వర్షాకాలం ప్రారంభం నుంచే కృష్ణానదీ పరివాహ ప్రాంతాలలో భారీ వర్షాలు నమోదయ్యాయి. కర్ణాటక జలాశయాలైన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుండి వరద నీరు రాకున్నప్పటికీ జూరాల



ఎగువ ప్రాంతాలలోని కృష్ణానదీ పరివాహక ప్రాంతం నుండి వచ్చిన వర్షపు నీటితో జూరాల పూర్తి స్థాయినీటి మట్టానికి చేరుకుంది. జూరాలకు వస్తున్న వర్షపు నీటిని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గూడెందొడ్డి రిజర్వాయర్ కు పంపు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేశారు. అయితే గత వారం రోజుల నుంచి వరద నీటి ప్రవాహం పూర్తిగా తగ్గడంతో పంపు మోటార్లు నిలిపివేశారు. శుక్రవారం సాయంత్రం నాటికి జూరాల ప్రాజెక్టులో 317.670 మీటర్ల స్థాయిలో నీరు నిల్వ ఉంది. జూరాలకు ఎగువ ప్రాంతం నుండి 449 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు వద్ద జలకళ కన్పిస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 మీటర్లు, 9,657 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 7.971 టిఎంసిల నీరు నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ప్రాజెక్టు నుండి సాగునీటి పథకాలకు నీటిని విడుదల చేయడం లేదన్నారు. జూరాలలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వతో పాటు వర్షపు నీరు చేరుతుండడంతో అన్నదాతలు ముందస్తు నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. కాని జూరాలపై ఆదారపడిన కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు నీరు వదలాలని రైతన్నలు కోరుతున్నారు.

# నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, జూన్ 28(నమస్తే ఉదయం):** శాస్త్రీపురం విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన రాఘవేంద్ర కాలనీ, అలీ భాయ్ మజీద్, శాస్త్రిపురం కొంత ప్రాంతం, జూమ్ కిరాణా, కీర్తి వాటర్ ,ఎమ్మెస్ స్కూల్ ప్రాంతాలలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగ దారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### మైలార్ దేవుపల్లిలో...

మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన వినాయక్ నగర్ ,దుర్గా నగర్, దుర్గా వెంచర్, దుర్గా కన్వెన్షన్, గణేష్ నగర్, శాంతినగర్, స్వప్న థియేటర్ పైనిర్ స్కూల్ ప్రాంతాలలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 1:00 వరకు, వినాయక నగర్, అలీనగర్, అయేషా కాలనీ ,మహమ్మద్ నగర్ ,కింగ్స్ ఎవెన్యూ, మిరాజ్ గార్డెన్, యూసఫ్ గుషన్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12 వరకు, సుభాన్ కాలనీ ఫేస్ –1, మిలన్ కాలనీ, రీగల్ గార్డెన్, పల్లె చెరువు, అయేసియా కాలనీ ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### శివరాం పల్లిలో...

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్ల నిమిత్తం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు వాదేయి సులేమాన్ నగర్, అక్బర్ హిల్స్, 11:30 నుండి 12 గంటల వరకు సులేమాన్ నగర్, చింతల్ మెట్, పహాడీ, మధ్యాహ్నం 12 నుండి 12:30 వరకు, ఆరంఘర్ మార్కండేయ నగర్, సోలిటరీ స్కూల్ ప్రాంతాలలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు, శివరాంపల్లి గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ ,బెస్ట్ ప్రైస్, కడారి హిల్స్, శ్రీదేవి కాలనీ ప్రాంతాలలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు, చింతల్ మెట్, ఇక్బాల్ ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు, ఎన్పీఏ కాలనీ ,వీకర్ సెక్షన్ కాలనీ, గవర్నమెంట్ స్కూల్, సులేమాన్ నగర్, కాజా హోటల్, డైమండ్ సిటీ ప్రాంతాలలో మధ్యాహ్నం ఒకటి గంట నుండి ఒకటిన్నర వరకు రాఘవేంద్ర కాలనీ, కింగ్స్ కాలనీ ప్రాంతాలలో ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ చారి తెలిపారు.

### గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం పద్మశాలి పురం మధువన్ కాలనీ ఆపో్క కాలనీ, సాయి కాలనీ ,టీఎన్జీవోస్ కాలనీ ప్రాంతాలలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విద్యుత్ సరఫరా అంతరాయానికి సహకరించాలని కోరారు.

## శంషాబాద్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**శంషాబాద్, జూన్ 28(నమస్తే ఉదయం):**
శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని రాల్లగూడ, జై భవాని, శంషాబాద్ విద్యుత్ ఫీడర్, పరిధిలో శనివారం ఉదయం 11:00 నుండి 11:30 వరకు , ఉదయం 10:00 నుండి 11 గంటల వరకు రాల్లగూడ సిద్దుల గుట్ట కమాన్, సీఎస్కే కాలనీ, సామా ఎంక్లేవ్, శ్రీనివాస నగర్, ఏర్పాటు కాలనీ, మజీద్ గడ్డ చౌదరి గూడ, ఓం జై భవాని, ఊట్ పల్లి రాయల్ విల్లాస్, తొండుపల్లి, బృందావన్ ప్రాంతాలలో, 11 గంటల నుండి 11:30 వరకు ఆర్బి నగర్ హుడా కాలనీ ఆర్.జి.ఐ పోలీస్ స్టేషన్ సిద్ధాంతి నక్షత్ర శంషాబాద్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



## నేడు హిమాయత్ సాగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**బండ్లగూడ, జూన్28(నమస్తే ఉదయం):**
ఇబ్రహీంబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మిలిటరీ విద్యుత్ ఫీడర్ పరిధిలో కీర్తి రిచ్ మండ్ విల్లాస్, మ్యాప్ లే టౌన్, విశ్వాస్ టౌన్, మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు పి అండ్ టి కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పిఎన్టి కాలనీ ఏ బి సి డి, స్పెషల్ బ్లాక్, సన్ సిటీ, గంధం కూడా విద్యుత్ ఫీడర్ పరిధిలోని సాయి బాలాజీ నగర్ యాదయ్య నగర్ కాలనీ కేకే –1, కేకే –2, ఫీల్ గుడ్ హోమ్స్ కిష్టారెడ్డి కాలనీ శ్రీనివాస్ నగర్ కాలనీ విఘ్నేశ్వర కాలనీ కార్వెల్ హోమ్స్ గంధం గూడ గ్రామం, మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు వెంకటేశ్వర కాలనీ ప్రశాంత్ కాలనీ డైమండ్ వ్యాలీ పద్మశ్రీ హిల్స్ పావని హార్మోని విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు విద్యుత్ వినియోగ దారులు ఈ సరఫరా అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### - కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):**
జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కోటిక్ కమిటీ సమన్వయ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న గంజాయి సాగు కేసులు, మాదక ద్రవ్యాలు వాడుతున్న వారి కేసులపై ఆరా తీయగా డిఎస్పీ కృష్ణ కిషోర్ వివరాలు తెలిపారు. 2016 నుండి జిల్లాలో (3) గంజాయి సాగు చేస్తున్న వారిపై కేసులు ఉన్నాయని, వాడిన వారు 17 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. స్పందించిన జిల్లా కలెక్టర్ గంజాయి సాగుపై వ్యవ సాయ విస్తీర్ణాధికారుల ప్రత్యేకదృష్టి సారించాలని సూచిం చారు. సాగును గుర్తించాల్సిన బాధ్యత




అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

ఏ.ఈ.ఒలపై ఉంద న్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, కమిటీలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి ధ్రువీకరణ చేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అన్ని సంక్షేమ హాస్టళ్లలో ను, గురుకుల, కే.జి.బి.వి.ల్లోనూ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఎక్కడైనా మాదక ద్రవ్యాల ఉత్పత్తి కానీ వాడకం కానీ జరిగినట్లు తెలిస్తే 8712671111 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం వాటి అనర్తాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) సంచిత గంగ్వార్, డి ఎఫ్ ఓ నవీన్ రెడ్డి, ఆర్డీఓ పద్మావతి, డిఎస్పీ కృష్ణ కిషోర్, అబ్కారీ శాఖ సుపరెడెంట్ ప్రభు వినయ్, రవాణా శాఖ అధికారి మానస, విద్యా శాఖ అధికారి గోవిందరాజులు, సంక్షేమ శాఖ అధికారులు, డ్రగ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వ్యాయమ ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు వై.శ్రీధర్, తదితరులు

## రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ ఉద్యోగ విరమణ

**రాజేంద్రనగర్, జూన్28(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కె. సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో సన్మాన సభ నిర్వహించారు. సత్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం సుగుణ ఆధ్వర్యంలో ఈ సన్మాన సభ జరిగింది. 30 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో వ్యాయమ ఉపాధ్యాయునిగా ఎంతోమంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత కె సత్యనారాయణకు దక్కుతుందని గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో అన్ని విషయాల్లో ముందుండి పనిచేసే స్వభావం గల వ్యక్తి సత్యనారాయణ మాస్టారు అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, సుఖసంతోషాలతో జీవించాలని, అష్టైశ్వర్యాలు ఇవ్వాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాఘవరెడ్డి, సోమేశ్వర రావు, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ అదేక్షుడు గుంజ బాబురావు, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ. వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలు మారేవారికి బుద్ధిచెప్పాలి

### తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నర్సింహా

**రాజేంద్రనగర్ జూన్28(నమస్తే ఉదయం):**



అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ వెంట ఉండి అధికారం పోయిన వెంటనే పార్టీ మారే వాళ్లకు ప్రజలు బుద్ధి చెప్తారని, అదే సమయంలో బీఆర్ఎస్ పెద్దలు గాలివాటం నాయకులను అధికారం లోకి వచ్చిన తర్వాత తిరిగి పార్టీలోకి చేర్చుకోవద్దని ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నర్సింహ అన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి పోయే వాళ్లు అసలు నాయకులే కాదన్నారు. వాళ్లు గాలివాటం గాళ్లు...అలాంటి వాళ్లను చేరదీయడం మొదలు మా తప్పు (బీఆర్ఎస్) అని గుర్తుచేశారు. ఏది ఏమైనా నిక్కార్సైన 2001 ఉద్యమకారులుగా, తెలంగాణ రాష్ట్ర సాధకులుగా నూటికి నూరుపాళ్ళు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే ఉంటాం అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో నిక్కార్సైన ఉద్యమకారులుగా మన మంత కేసీఆర్ వెంట ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరు అధైర్య పడాల్సినటువంటి అవసరం లేదన్నారు. కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. ఈ గాలివాటం గాలను తిరిగి చేరదీయకుండా మనమంతా ఐక్యంగా ఉండి పోరాడుదాం అని పిలుపునిచ్చారు. తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గాలివాటం వాళ్లు మళ్లీ రాకుండా చూడాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. ఎలాంటి జంకు బొంకు లేకుండా ఖచ్చితంగా కేసీఆర్‌కు అండగా ఉందాం.. ప్రజల పక్షాన పోరాడుదాం అని చిలకమర్రి నర్సింహా కోరారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. “RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.